క్లుప్తంగా

మినీ గోకులం యూనిట్ల మంజూరు

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలానికి 48 మినీ గోకులం యూనిట్లు మంజూరయ్యాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభల ద్వారా జరుగుతుందన్నారు. దీంట్లో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తారన్నారు. రెండు పశువులకు రూ.1.15 లక్షలు, 4 పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు 2.30 లక్షలు యూనిట్ కాస్ట్ కాగా దానిలో పది శాతం లబ్ధిదారుడు తన వాటాగా చెల్లించాలని, మిగిలిన 90 శాతం గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేస్తారన్నారు. వీటితో పాటు మేకల షెడ్లు కూడా నిర్మిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎంఈఓ హెలీనాకు సత్కారం



ఎంఈఓను హెలీనాను సత్కరిస్తున్న అపుస్మా సభ్యులు

పి.గన్నవరం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి కోన హెలీనాను రాజోలు డివిజన్ అపుస్మా(ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్య అసోసియేషన్) అధ్యక్షుడు ఆర్.గోపీనాథ్ ఆధ్వర్యంలో ప్రైవేటు విద్యాసంస్థల అధినేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. హెలీనా అందిస్తున్న సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారావు, జిల్లా నాయకులు అయ్యప్పనాయుడు, శ్రీనివాస్, కిరణ్, రాఘవేంద్ర నాయుడు, రత్నరాజు, ఏవీఆర్ హనుమాన్, జోమీ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మలికిపురం: ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పూసిన వీరేంద్రకుమార్ కోరారు. మలికిపురంలో మండల ఫొటోగ్రాఫర్ల సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా సీవీ రావు, అధ్యక్షుడిగా నేల శ్రీనివాస్, సెక్రటరీగా దాసంశెట్టి కేశవ, ట్రెజరర్‌గా డి.మోహన్, ఉపాధ్యక్షుడిగా ఆకుల గోవిందరాజు, జాయింట్ సెక్రటరీగా సీహెచ్ అర్జున్, కన్వీనర్‌గా భానురాజా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వీరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు హెల్త్‌కార్డులు, పింఛన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సి.వి రవ, స్టీరింగ్ కమిటీ సభ్యుడు టి.ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు గెడ్డం సురేష్‌కుమార్, బి.కోటేశ్వరరావు, నామాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ శ్రీనివాస్‌కు అవార్డు



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న శ్రీనివాస్

సఖినేటిపల్లి: మండల పరిధిలోని అప్పనరామునిలంకకు చెందిన మండల ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ ప్రెసిడెంట్ నల్లి శ్రీనివాస్‌కు నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన వరల్డ్ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా అవార్డు దక్కింది. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన ఫొటో కాంపిటీషన్‌లో ట్రావెల్ విభాగంలో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని కులుమనాలిలో శ్రీనివాస్ తీసిన ఫొటోకు అప్రిషియేషన్ అవార్డు లభించింది. విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ కె.గంగాధర్ రావు, ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ప్రొఫెసర్ జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాజోలు: సినీ నటుడు చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం రాజోలు ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించి చిరంజీవి అభిమానులను అభినందించారు. కార్యక్రమంలో సూరిశెట్టి శ్రీనివాసరావు, పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణి, గుండాబత్తుల తాతాజీ, కోళ్ల బాబి, రేకపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం.. ప్రతిభకు ప్రోత్సాహం

- చదువులో రాణిస్తున్న విద్యార్థులకు దాతల సహకారం
- ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా నగదు ప్రోత్సాహకాల అందజేత



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మారుతీ బంగారం(ఫైల్)

కొత్తపేట: ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం అనేది ఎంతో బలాన్ని ఇస్తుంది. మరిన్ని విజయాలు సాధించడానికి ఆలంబనగా నిలుస్తుంది. జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు సాయపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులంతా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే. వారిలో ఎంతో మంది చదువులో రాణిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు పలువురు దాతలు ఏటా తమ తల్లిదండ్రుల పేరున, సేవా సంస్థలు, ట్రస్టుల ద్వారా నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. దాంతో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నత చదువుల వైపు దూసుకుపోతున్నారు.

ప్రోత్సాహకాల కోసం రూ.5 లక్షల డిపాజిట్

కొత్తపేటకు చెందిన మంతెన సర్వ అన్నపూర్ణ స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఉత్తమ విద్యార్థుల నగదు ప్రోత్సాహకాల నిమిత్తం స్కూలు పేరున రూ.5 లక్షలు డిపాజిట్ చేశారు. దానిపై ఏటా వడ్డీ రూపంలో సుమారు రూ.30 వేల వరకూ వస్తోంది. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు సదరు సొమ్మును ప్రోత్సాహకంగా అందజేస్తున్నారు.

ఏటా నగదు ప్రోత్సాహకాలు

● కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన యర్రాప్రగడ సోదరులు గత కొన్నేళ్లుగా కొత్తపేటలో ఉన్నత పాఠశాలల ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు. యూఎస్ఏలో స్థిరపడిన వెంకటరమణ, రాజశేఖరం సోదరులు తమ తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఏటా స్థానిక ప్రభుత్వ బాలుర, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.25 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

● స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రప్రథమ ప్రధానోపాధ్యాయుడు ముత్యాల సుబ్బారాయుడు పేరున ఆయన కుటుంబ సభ్యులు, సుబ్బారాయుడు ట్రస్ట్ సభ్యులు ఉత్తమ విద్యార్థులకు సుమారు రూ.10 వేలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు.

● ఇదే పాఠశాలలో గరిమెళ్ల వెంకటసుబ్బారాయుడు, బండారు సీతారామయ్య, వాజపేయాజుల వెంకటసత్యనారాయణ, కాకినాడ అప్పలాచారి, ఐఏ కృష్ణమూర్తి, 2017 బ్యాచ్‌కు చెందిన 20 మంది ఉపాధ్యాయులు చేసిన డిపాజిట్లపై వచ్చే వడ్డీని ఉత్తమ విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నారు.

● మండల పరిధిలోని అవిడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన రెడ్డి వీరవెంకటసత్యనారాయణ రూ.60 వేలు, తురగా సుందరయ్య రూ.43,000 డిపాజిట్ చేయగా దానిపై వచ్చే వడ్డీని పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలుగా అందజేస్తున్నారు.

● పలివెల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ విద్యార్థులకు గ్రామంలోని అభయాంజనేయ స్వామివారి ఆలయ ట్రస్ట్ ద్వారా ఫౌండర్ విన్నకోట వీఎస్ఎన్ మారుతీ బంగారం ఏటా జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు.

● ఈవని రామచంద్ర పెట్రోఫిల్ అధినేత ఈవని రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థ మేనేజర్ విన్నకోట ఫణి రాఘవేంద్రరావు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉత్తమ విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందచేస్తున్నారు.

● జూనియర్ కళాశాల 1969–71 ప్రప్రథమ బ్యాచ్ విద్యార్థులు కొన్నేళ్ల క్రితం పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. ఆ సందర్భంగా కళాశాలలో 4 జనరల్ గ్రూపుల నుంచి ఫస్ట్ వచ్చిన ఉత్తమ విద్యార్థుల ప్రోత్సాహం నిమిత్తం రూ.3 లక్షలు డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీతో సుమారు రూ.25 వేలు నలుగురు విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సాహకంగా బహుమతులుగా అందజేస్తున్నారు.

● అయ్యగారి సేవాసమితి తరపున సెకండ్ లాంగ్వేజ్ తెలుగు గ్రూపు ఉత్తమ విద్యార్థులకు రూ.16,500 ప్రోత్సాహకంగా ఇస్తున్నారు. అదే కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న తనికెళ్ల శాస్త్రి ఇద్దరు ఉత్తమ విద్యార్థులకు రూ.3 వేలు ఇస్తున్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలువురు పూర్వ అధ్యాపకులు సుమారు రూ.70 వేలు డిపాజిట్ చేయగా దానిపై వచ్చే వడ్డీని ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులుగా అందజేస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు దోహదం



విద్యార్థులకు వివిధ రూపాల్లో ప్రోత్సాహం అనేది వారి ఉన్నత భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునేది ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులే. ముఖ్యంగా ఇటువంటి ప్రోత్సాహకాలు ఉత్తమ విద్యార్థుల్లో పట్టుదల, పోటీతత్వాన్ని పెంచుతాయి.

– డాక్టర్ కె.పెద్దిరాజు, ప్రిన్సిపాల్, వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొత్తపేట

సహజసిద్ధంగా పండిన ఉత్పత్తులతో మేలు



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభించిన ఏపీఎం విజయ్

సఖినేటిపల్లి: ప్రకృతి వ్యవసాయంలో సహజసిద్ధంగా పండించిన ఉత్పత్తులను వినియోగించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డీఆర్‌డీఏ ఏపీఎం కె.విజయ్ అన్నారు. మంగళవారం అంతర్వేదిపాలెంలో కువైట్ మార్ట్ యూనిట్ ప్రాంగణంలో రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ, మండల మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను ఏపీఎం విజయ్ ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ పి.జోసెఫ్, యూనిట్ ఇన్‌చార్జ్ వై.జూలీ, లలిత కుమారి, చిట్టి స్వరాజ్, పుష్పలత పాల్గొన్నారు.

23న ప్రత్యేక గ్రామ సభలు

అంబాజీపేట: ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు మండలంలోని 16 గ్రామాల్లో ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ జి.సరోవర్ మంగళవారం తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఉపాధి హామీ పథకం పనులకు ప్రతిపాదనలు చేసేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరుగుతున్న పనులకు సంబంధించి పని దినాలు, ఖర్చుల వివరాలు, కొత్తగా గుర్తించిన పనులను సభలో చదివి ప్రజల అనుమతి పొందాలన్నారు.

దోమల నిర్మూలనతో ఆరోగ్య పరిరక్షణ



పెదపళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆలమూరు: ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు దోమల నిర్మూలనకు శ్రద్ధ వహించాలని పెదపళ్ల, చొప్పెల్ల, పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం జరిగింది,. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. మలేరియాపై పోరాటాన్ని తీవ్రతరం చేద్దామంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల పరిధిలో నిర్వహించిన సమావేశంలో దోమల వల్లే మలేరియా వ్యాప్తి చెందుతుందని అవగాహన కల్పించారు. దోమల బారిన పడి ఏటా లక్షల మంది మృతి చెందుతున్నారని ఆందోళన చెందారు. దోమల వల్ల సంభవించే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వైద్యాధికారులు ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్, సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.

ముంపు బారిన కార్యాలయ రహదారి



ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపునీరు

అయినవిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లే రహదారి చిన్నపాటి వర్షానికి ముంపుబారిన పడుతోంది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షానికి మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారి మోకాళ్ల లోతు వరకూ మునిగింది. తమ సమస్యలు చెప్పుకోవడానికి ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో తమ బాగోగులు చూడాల్సిన ఉన్నతాధికారులు ఉండే కార్యాలయాలకు వెళ్లే రహదారులే మోకాళ్ల లోతు మురుగునీటితో ఉండిపోతే ఇంక ప్రజల కష్టాలు ఏం పట్టించుకుంటారంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి



అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ రమ్యశైలజ

మామిడికుదురు: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినపుడే దోమల నిర్మూలన సాధ్యమని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.రమ్యశైలజ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం మగటపల్లి పంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రాణాంతకమైన డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు దోమల వల్లే వ్యాప్తి చెందుతాయన్నారు. దోమ రహిత సమాజం–ఆరోగ్యానికి సోపానం అని ఆమె పేర్కొన్నారు. సదస్సులో దోమల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ యు.దివ్య, ఏఎన్ఎం ఆర్.రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌కు సహకరించాలని వినతి



నగరంలో కరపత్రాలు పంచుతున్న మండల జేఏసీ ప్రతినిధులు

మామిడికుదురు: రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించనున్న భారత్ బంద్‌కు సహకరించాలని కోరుతూ మండల జేఏసీ ప్రతినిధులు మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, మొగలికుదురు తదితర గ్రామాల్లో మంగళవారం కరపత్రాలు పంచారు. రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల జేఏసీ ప్రతినిధులు బొంతు మణిరాజు, నల్లి శ్రీనివాస్, కలిగితి పళ్లంరాజు, బత్తుల జనార్దనరావు, మట్టా సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



పి.గన్నవరంలో రాజీవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు వద్ద భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టాల రామజోగేశ్వర రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో పీసీసీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు, అంబాజీపేటలో మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మామిడికుదురులో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అప్పన రామకృష్ణల ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

ఈదురు గాలులతో దుమారం

- కూలిన చెట్టు, తెగిన విద్యుత్ తీగలు



పెదపళ్ల–వెదురుమూడి రోడ్డులో కూలిన చెట్టు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలో మంగళవారం కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు దుమారం రేగింది. భారీ గానుగ చెట్టు విరిగిపడింది. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలో పాన్‌షాపు పక్కన ఉన్న చెట్టు కూలడంతో, కొత్తూరు నుంచి వెదురుమూడి వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది, ఆ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో వైర్లన్నీ చెల్లాచెదురుగా రోడ్డుపై పడ్డాయి. ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపి, విద్యుత్ తీగలను తొలగించారు. ఈ ఘటనతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయింది, సర్పంచ్ ఏడిద సత్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి వి.వేణి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీ సాయంతో కూలిన చెట్టును తొలగించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాలు తరలించాలి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలను అదే గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకుకు తరలించాలని గ్రామానికి చెందిన తాడి శ్రీనివాస్‌రెడ్డి, చింతలపూడి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివశంకరప్రసాద్‌ను మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలోని దాదాపు 150 డ్వాక్రా సంఘాలు ఆలమూరులోని యూనియన్ బ్యాంకు ద్వారానే లావాదేవీలు జరపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందుకే జొన్నాడలోని యూనియన్ బ్యాంకుకు ఖాతాలను తరలిస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అధ్యాపకులకు గంట బోధనకు రూ.150 చొప్పున, నెలకు గరిష్టంగా రూ.10 వేలు చెల్లిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని కోరారు.

పనుల గుర్తింపుపై సమావేశం



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మల్లిబాబు

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలో ఉపాధి హామీ పథకంలో గుర్తించవలసిన వివిధ పనులపై పలు శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఎంపీడీవో పీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వీరా మల్లిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్తించవలసిన పనులపై సమీక్షించారు. ఏపీవో నాగప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శిరీష, ఎంఈవో–1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో–2 మద్దాలి వెంకటేశ్వరరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీలకు సత్కారం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో నాగప్రసాద్‌కు, జేఈ శ్రీనివాస్‌ను ఎంపీపీ మల్లిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

- మట్టి విగ్రహాలకు పెరిగిన గిరాకీ



కొత్తపేటలో మట్టి గణపతి విగ్రహాలు తయారు చేస్తున్న మహిళ



కొత్తపేటలో ఒక తయారీ కేంద్రంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు

కొత్తపేట: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వచ్చే నెల 7వ తేదీన వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో వీధివీధినా గణపతి నవరాత్రుల పేరిట ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో విగ్రహ తయారీదారులు వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. కొత్తపేట, రావులపాలెం ప్రాంతాల్లో విగ్రహ తయారీ కంపెనీలతో పాటు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి విగ్రహాలు తయారుచేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో గణపతి, దేవీ నవరాత్రుల సందర్భంగా దేవతా మూర్తుల విగ్రహాలు తయారుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని సుమారు రెండు నెలల ముందు నుంచే విగ్రహాలు తయారీ ప్రారంభిస్తారు. ఈ ఏడాది చవితికి వచ్చిన ఆర్డర్ల మేరకు 2 అడుగుల నుంచి 15 అడుగుల వరకూ భారీ విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ)తో పాటు కొందరు భక్తుల కోరిక మేరకు మట్టితో గణపతి విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. పీఓపీ విగ్రహాలు విశాఖపట్టణం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకూ సుమారు 5 వేల విగ్రహాలు సిద్ధం చేస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.2 వేల నుంచి రూ.25 వేల ధరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

మట్టి విగ్రహాలే తయారు చేస్తున్నాం



గతంలో మా తయారీ కేంద్రంలో మట్టి విగ్రహాలతో పాటు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు కూడా తయారుచేసేవాళ్లం. ఉత్సవ కమిటీల కోరిక మేరకు భారీ విగ్రహాలు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసేవాళ్లం. అయితే పర్యావరణం పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఆ విగ్రహాలు విక్రయించడంలేదు. పైగా వ్యయ ప్రయాసలు తప్ప డబ్బులు మిగలడం లేదు. ప్రస్తుతం కేవలం మట్టి విగ్రహాలే తయారు చేస్తున్నాం.

– మంతెన సుబ్రహ్మణ్యం, విగ్రహాల తయారీదారుడు, కొత్తపేట

స్కూల్ బస్ ప్రమాదంపై విచారణ

మలికిపురం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో ప్రమాదానికి గురైన మలికిపురం భాష్యం స్కూల్ ఉదంతంపై విచారణ నిర్వహించినట్లు ఎంఈఓ–1 ఎం.విజయశ్రీ, ఎంఈఓ–2 వైవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు పాఠశాల వద్దకు వెళ్లి ప్రమాదానికి గురైన బస్‌ను పరిశీలించామన్నారు. ఘటనపై భాష్యం స్కూల్ యాజమాన్యం నుంచి లిఖిత పూర్వక వివరణ కోరినట్లు ఎంఈఓ–2 సత్యనారాయణ తెలిపారు. పాఠశాలల బస్ డ్రైవర్ల తీరుపై త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ విజయశ్రీ తెలిపారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో మోటారు సైకిల్‌ను నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడుపుతున్న కొందరు యువకులను ఎస్ఐ జ్వాలాసాగర్ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఆరు మోటారు సైకిళ్లపై కొందరు యువకులు అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. అది గుర్తించిన ఎస్ఐ వారిని అదుపులోకి తీసుకుని వారి తల్లితండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ఇదే పునరావృతమైతే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్వరితగతిన వెంకన్న ఆలయ పనులు



ఆలయ పనులను పరిశీలిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారి నూతన ఆలయం త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. మంగళవారం ఆలయంలో మూడో వరుస రాతి పనులు ప్రారంభం కావడంతో పనులను క్షేత్ర స్థాయిలో ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర ఉన్న మీసాల వెంకన్న ఆలయ పునర్నిర్మాణ పనులు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. అనంతరం స్థానిక మదర్‌థెరిస్సా నర్సింగ్ కళాశాలను ఆర్ఏఓ మునిస్వామితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓల్డేజ్‌హోమ్ ద్వారా మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఎస్టీపీపీ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని కోరుతూ మంగళవారం పలువురు విద్యార్థులు మల్లాడి కృష్ణారావుకు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సంబంధిత విద్యాశాఖ అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో అధ్యాపకులను నియమిస్తారంటూ హామీ ఇచ్చారు. అదేవిధంగా డయాలసిస్‌తో బాధపడుతున్న రోగులకు వైద్యసేవలు అందించాలని జిప్‌మెర్ వైద్యులను ఆదేశించారు.